రెండేళ్లు పోయాక ఫారో రాజుగారికి ఓ కల వచ్చింది. నైల్ నదిలోంచి పుష్టిగా వున్న ఏడు ఆవులు బయటకు వచ్చి గడ్డి మేస్తున్నాయి. వాటి వెంటనే బక్కచిక్కిన ఆవులు ఏడు వచ్చి ముందు వచ్చిన ఆవుల్ని తినేశాయి. ఆ తర్వాత యింకో కల కూడా యిలాటిదే వచ్చింది. మర్నాడు రాజు కొలువు తీర్చి యీ కలలకు అర్థమేమిటని అడిగాడు. ఎవరూ చెప్పలేకపోయారు. అప్పుడు మద్యాధికారికి జోసెఫ్ గుర్తుకు వచ్చాడు. అతని గురించి చెప్తే రాజు జైలునుంచి రప్పించి అర్థం చెప్పమన్నాడు. "ఓ రాజా దీనికి అర్థం రాబోయే ఏడు సంవత్సరాలలో పంటలు బాగా పండుతాయి. ఆ తర్వాత ఏడు సంవత్సరాల కరువు వచ్చి ముందు దాచుకున్న వనరులన్నీ తినేస్తుంది. ఇది భగవంతుడి నిర్ణయం. అందువలన తమరు ఎవరైనా ఒక తెలివైనవాడిని అధికారిగా నియమించి సమృద్ధిగా పండే రోజుల్లోనే ఐదోవంతు ధాన్యాన్ని దాచి వుంచితే కరువురోజుల్లో అది అక్కరకు వస్తుంది" అన్నాడు. "నీ కంటె ముందుచూపు కలవాడు, తెలివైనవాడు నాకు కనబడటం లేదు. దేవుడే నిన్ను నా వద్దకు పంపి నన్ను జాగ్రత్తపడమన్నాడేమో. నిన్నే ఆ అధికారిగా నియమిస్తున్నాను" అన్నాడు రాజు. అంతేకాదు, అసెనాత్ అనే అమ్మాయి నిచ్చి పెళ్లి చేశాడు.



జోసెఫ్, ఫారో రాజు

ఆ విధంగా 30 సం॥ల వయసులో జోసెఫ్ రాజు కొలువులో అధికారిగా చేరాడు. అతను చెప్పినట్టుగానే ఏడేళ్ల పాటు పంటలు బాగా పండాయి. అతను ఐదోవంతు ధాన్యాన్ని సేకరించి గోదాములలో దాచి వుంచాడు. ఏడేళ్ల కరువు రాగానే దాన్ని ఈజిప్టు ప్రజలకు అమ్మసాగాడు. చుట్టు పక్కల దేశాలవారు యీ జాగ్రత్త పడకపోవడం వలన వాళ్లకు ఆహారధాన్యాల కొరత ఏర్పడి ఈజిప్టుకి వచ్చి కొనుక్కుని పోసాగారు. జోసెఫ్ తండ్రి జాకబ్ వుండే కానన్ దేశంలో కూడా కరువే. ఈజిప్టులో ధాన్యం దొరుకుతోందని విని అతను తన కొడుకులందరినీ డబ్బిచ్చి ఈజిప్టుకి పంపాడు. ఆఖరి కొడుకు బెంజమిన్‌ను మాత్రం తన వద్దే వుంచుకున్నాడు. జోసెఫ్ సోదరులందరూ ఈజిప్టు వచ్చి అక్కడ గవర్నరుగా వున్న జోసెఫ్ వద్దకు వచ్చి అతన్ని గుర్తు పట్టలేక, తమకు ధాన్యం అమ్మమని కోరారు. వాళ్ల హీబ్రూభాష తనకు అర్థం కానట్టు నటిస్తూ జోసెఫ్ దుబాసీ ద్వారా అడిగించాడు – "మిమ్మల్ని చూస్తే గూఢచారుల్లా వున్నారే" అని. వాళ్లు కాదు కాదంటూ తమ తండ్రి గురించి, చిన్న సోదరుడి గురించి చెప్పారు. "మీరు చెప్పినమాటలు విశ్వసించాలంటే మీ చిన్నతమ్ముణ్ని తీసుకుని రండి. అప్పటివరకూ మీ సోదరుల్లో ఒకడైన సైమన్‌ను యిక్కడే బంధించి వుంచుతాను" అన్నాడు జోసెఫ్.

"చూశావా, మనం ఆనాడు జోసెఫ్‌కు చేసిన అన్యాయానికి అనుభవిస్తున్నాం" అని తమలో తాము అనుకున్నారు వారు. జోసెఫ్‌కి అది అర్థమైనా కానట్టు నటించాడు. వాళ్లకు ధాన్యం యిచ్చేటప్పుడు వారు చెల్లించిన డబ్బు కూడా ధాన్యంతో బాటు బస్తాల్లో పెట్టి తిరిగి యిచ్చేశాడు. వాళ్లు యింటికి వెళ్లి చూసి ఆశ్చర్యపడ్డారు. తండ్రికి యిదంతా చెప్పి బెంజమిన్‌ను తమతో పంపమని అడిగారు. "నా చిన్న భార్య కొడుకుల్లో జోసెఫ్ ఎలాగూ పోయాడు. మిగిలినవాడు బెంజమిన్ ఒక్కడే. వాడిని వదులుకోను" అన్నాడు జాకబ్. కానీ రెండో ఏడాది కూడా కరువు రావడంతో వీళ్లు మళ్లీ ఈజిప్టుకి వెళ్లక తప్పలేదు. బెంజమిన్‌ను తీసుకుని వెళ్లకపోతే అక్కడి గవర్నరు రానివ్వడు, అందుచేత జూదా బెంజమిన్‌ను తిరిగి తెచ్చే బాధ్యత వహించాడు. ఎట్టకేలకు జాకబ్ సమ్మతించాడు.

రెట్టింపు డబ్బులు, తండ్రి యిచ్చిన బహుమతులతో వీళ్లు ఈజిప్టు వెళ్లి జోసెఫ్‌ను కలిశారు. వీళ్లకు అతను తన యింట్లో విందు ఏర్పాటు చేశాడు. చక్కటి భోజనం పెట్టి తిప్పి పంపిస్తూ తన నౌకరు చేత తన వెండిగిన్నె బెంజమిన్ తిండిగింజల బస్తాలో దొంగతనంగా పెట్టించాడు. వాళ్లు వెళుతూంటే దారిలో అదే నౌకరు చేత వాళ్లను అటకాయించాడు. "తిండి పెట్టినవాడి యింట్లో వెండిగిన్నె దొంగిలిస్తారా?" అంటూ. వెతికితే బెంజమిన్ సంచీలో దొరికింది. బెంజమిన్‌ను పట్టుకుని ఖైదు చేస్తానంటూ నౌకరు అతన్ని వెనక్కి తీసుకెళ్లాడు. అప్పుడు సోదరులందరూ జోసెఫ్ వద్దకు వచ్చి మోకరిల్లారు, అచ్చు గతంలో అతను కలగన్నట్లే. "మా వలన తప్పు జరిగింది. శిక్షిస్తే అందర్నీ శిక్షించు. బెంజమిన్‌ను ఒక్కణ్నీ వదిలేసి వెళ్లలేము" అని వాళ్లు ప్రాధేయపడ్డారు. వాళ్ల పశ్చాత్తాపం చూసి కరిగిన జోసెఫ్ తనెవరో ప్రకటించి వాళ్లను ఊరడించాడు. విషయం తెలిసి ఈజిప్టు రాజు కూడా సంతోషించి, "మీరందరూ మీ కుటుంబాలతో సహా ఈజిప్టు వచ్చి నివసించండి" అని ఆహ్వానించాడు. వాళ్లు యింటికి వచ్చి తండ్రికి విషయాలన్నీ చెప్పి ఈజిప్టు తరలి వెళ్లడానికి అతన్ని ఒప్పించారు. అతను వచ్చాక ఫారో జోసెఫ్ అన్నదమ్ముల కుటుంబాలన్నిటికీ కలిపి ఈజిప్టులో ఓ ప్రాంతం వాళ్లకు యిచ్చేశాడు.

130 సంవత్సరాల వయసులో ఈజిప్టు వచ్చిన జాకబ్ ఇంకో 17 సం॥లు అక్కడ జీవించి 147 సంవత్సరాల వయసులో మరణించాడు. తన పూర్వీకులను సమాధి చేసినచోటే తననూ పూడ్చి పెట్టమని కొడుకులను కోరాడు. మరణానికి ముందు తన పన్నెండుమంది పిల్లలనూ పిలిచి ఒక్కొక్కరి లక్షణాలను వివరించి, వారి పేర ఏర్పడబోయే జాతులకు కూడా అవే లక్షణాలుంటాయని చెప్పాడు. భగవంతుడు తమ హీబ్రూలకోసం ఇజ్రాయేల్ అనే దేశాన్ని సృష్టించి యిస్తాడని, అక్కడ యీ జాతులన్నీ వర్ధిల్లుతాయనీ

జోస్యం చెప్పాడు.

అతని కోరిక ప్రకారమే సమాధి చేసిన తర్వాత జోసెఫ్ సోదరులకు భయం వేసింది – తండ్రి చనిపోయాడు కాబట్టి జోసెఫ్ యిప్పుడు తమపై పగ సాధిస్తాడని. వాళ్లంతా అతని ముందు మోకరిల్లి శరణు వేడారు. జోసెఫ్ వారికి అభయం యిచ్చాడు. "మీరు నాకు కీడు తలపెట్టినా, దాని ద్వారా  భగవంతుడు నాకు మేలు చేశాడు. మనమంతా కలిసే వుందాం. భగవంతుడు మనకు ప్రసాదించబోయే ఇజ్రాయేలు చూసే భాగ్యం నాకు లేదు. నా మరణానంతరం నన్నిక్కడే సమాధి చేయండి. కానీ నా ఎముకలను భద్రపరచి, ఇజ్రాయేలు తీసుకెళ్లండి" అన్నాడు. తన 110 వ యేట అతను మరణించాడు.

రాజు యిచ్చిన స్థలంలో యీ విధంగా ఈజిప్టులో స్థిరపడిన హీబ్రూలు కాలక్రమేణా  బానిసలు కావడం, తర్వాతికాలంలో మోసెస్ వీళ్లను దాస్యవిముక్తులను చేసి ఇజ్రాయేలుకి తీసుకెళ్లి స్థిరనివాసం ఏర్పరచడం జరుగుతాయి. ("టెన్ కమాండ్‌మెంట్స్" సినిమా ద్వారా ఆ కథ అందరికీ సుపరిచితం) ఆ కథ బైబిల్‌లోని రెండవ పుస్తకం "ఎక్సోడస్" (నిష్క్రమణ) లో వర్ణించబడింది. దాని కథ వచ్చే గురువారం నుండి. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**